ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 153 | పేజీలు: 4 | వెల: రూ.3/- | బుధవారం 11 సెప్టెంబర్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్



## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి మరువలేం

### వర్ధంతి సందర్భంగా కెసిఆర్ నివాళి

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (ప్రభాత ఉదయం): తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు వీరనారి చిట్యాల ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె పోరాట స్ఫూర్తిని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ స్మరించుకున్నారు. తెలంగాణ మహిళాశక్తికి, బహుజన ధీరత్వానికి ఐలమ్మ ప్రతీకగా నిలిచారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనకోసం సాగిన ఉద్యమంలో వారి పోరాట స్ఫూర్తి ఇమిడి వున్నదని తెలిపారు. ప్రజావ్యతిరేక పాలనపై ధిక్కారాన్ని ప్రకటించిన చాకలి ఐలమ్మ ప్రతిఘటనా తత్వం ఎల్లవేళలా ఆదర్శమని కేసీఆర్ చెప్పారు. ఐలమ్మ స్ఫూర్తిని కొనసాగించే దిశగా ఆమె జయంతిని తెలంగాణ ప్రభుత్వం ప్రతి ఏటా అధికారికంగా నిర్వహించాలని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్ణయించిందని వెల్లడించారు. భూమి కోసం,

..మిగతా 2లో

# దేశంలోనే తెలంగాణ యంగెస్ట్ స్టేట్




### ఫ్యూచర్ స్టేట్‌గా అభివృద్ధి చేస్తున్నాం.. వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రం
### దేశాభివృద్ధిలో తెలంగాణ కీలక భూమిక.. రుణాన్ని రీ స్ట్రక్చర్ చేసే అవకాశం ఇవ్వాలి
### రాష్ట్రాల పన్నుల వాటాను 41 నుంచి 50 శాతానికి పెంచాలి
### 16వ ఆర్థిక సంఘం భేటీలో సిఎం రేవంత్ సూచన

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (ప్రభాత ఉదయం): దేశంలోనే తెలంగాణ యంగెస్ట్ స్టేట్‌అని.. మా రాష్ట్రాన్ని ది ఫ్యూచర్ స్టేట్‌గా పిలుస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజాభవన్‌లో జరిగిన 16వ ఆర్థిక సంఘం సమావేశంలో రేవంత్ మాట్లాడుతూ.. దేశంలోనే తెలంగాణ వేగంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రమని పేర్కొన్నారు. మన దేశాభివృద్ధిలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. బలమైన పునాదులు, చక్కటి ఆర్థిక వ్యవస్థ ఉన్నప్పటికీ... ఆర్థికంగా తెలంగాణ అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని అన్నారు. భారీ రుణ భారం తెలంగాణకు సవాల్‌గా మారిందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి రుణ భారం రూ.6.85 లక్షల కోట్లకు చేరుకుందన్నారు. ఇందులో బడ్జెట్ రుణాలతో పాటు ఆఫ్-బడ్జెట్ రుణాలు ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గత పదేళ్లలో మౌలిక ప్రాజెక్టులకు నిధుల సమీకరణకు ప్రభుత్వం భారీగా అప్పులు తీసుకుందని పేర్కొన్నారు. దీంతో ఇప్పుడు రాష్ట్ర ఆదాయంలో ఎక్కువ భాగం రుణాన్ని తిరిగి చెల్లించడానికే వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రుణాలు, వడ్డీ చెల్లింపులు సక్రమంగా నిర్వహించకపోతే రాష్ట్ర పురోగతిపై ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో రుణాల సమస్యను పరిష్కరించేందుకు మాకు తగిన సహాయం, మద్దతు ఇవ్వాలని కోరుతున్నామన్నారు. రుణాన్ని రీ స్ట్రక్చర్ చేసే అవకాశం ఇవ్వాలని.. లేదా మాకు అదనపు ఆర్థిక సహాయాన్ని అందించాలని రేవంత్ పేర్కొన్నారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు పంపిణీ చేసే నిధుల వాటాను 41 శాతం నుంచి 50శాతానికి పెంచాలన్నారు. అన్ని రాష్ట్రాల తరపున ఈ డిమాండ్‌ను మీ ముందు ఉంచుతున్నామన్నారు. ఈ డిమాండ్ ను మీరు నెరవేర్చితే.. దేశాన్ని 5 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మార్చాలని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఎంచుకున్న లక్ష్య సాధనకు తాము సంపూర్ణంగా సహకరిస్తామన్నారు. తెలంగాణను తాము ఒక ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతామని రేవంత్ అన్నారు. తెలంగాణకు తగినంత సహాయం అందించాలని.. దేశాన్ని ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చడంలో మా వంతు బాధ్యతను నెరవేరుస్తామన్నారు. ఫిస్కల్ ఫెడరలిజాన్ని బలోపేతం చేయడంలో మీ మద్దతు కోరుతున్నామని తెలిపారు. తెలంగాణ ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు మీ సిఫారసులు ఉపయోగపడతాయని మేం నమ్ముతున్నామని రేవంత్

..మిగతా 2లో



## దేశాభివృద్ధిలో సైబర్ సెక్యూరిటీ కీలక భూమిక

### సైబర్ నేరాల నిరోధానికి కేంద్ర ప్రభుత్వం ప్రణాళిక
### ఐదేళ్లలో 5 వేల సైబర్ కమాండోలకు శిక్షణ
### సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ ఆవిర్భావోత్సవంలో అమిత్ షా

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10 (ప్రభాత ఉదయం): దేశాభివృద్ధిలో సైబర్ సెక్యూరిటీ కీలక భూమిక పోషిస్తోందని, సైబర్ క్రైమ్‌ల నిరోధానికి కేంద్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తోందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తెలిపారు. సైబర్ నేరాలను నిరోధించేందుకు రాబోయే ఐదేళ్లలో 5 వేల సైబర్ కమాండోలకు శిక్షణ ద్వారా సిద్ధం చేసేందుకు కేంద్ర ఆలోస్తోందని చెప్పారు. ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ తొలి ఆవిర్భావ దినోత్సవంలో అమిత్‌షా మంగళవారంనాడు మాట్లాడుతూ, సైబర్ బేస్డ్ డాటా రిజిస్ట్రీ ఏర్పాటు, సైజర్ క్రైమ్ సమాచారం షేర్ చేసేందుకు ఒక పోర్టల్, అనుమానితులు భవిష్యత్ నేరాలకు పాల్పడకుండా నిరోధించేందుకు నేషనల్ రిజిస్ట్రీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. సైబర్ నేరాలకు ఎల్లలు లేవని, సైబర్ సెక్యూరిటీ లేకుండా జాతీయ భద్రత అసాధ్యమని స్పష్టం చేశారు. ప్రధాన బ్యాంకులు, ఫైనాన్షియల్ ఇంటర్మీడియేటరీస్, పేమెంట్ అగ్రిగేటర్లు, టెలికాం సర్వీస్ ప్రొవైడర్లు, ఐడీ ఇంటర్మీడియేటరీస్,

..మిగతా 2లో

## మణిపూర్‌లో మరోమారు ఆందోళన

### ఇంటర్‌నెట్‌ను నిలిపివేసిన అధికారులు



ఇంఫాల్, సెప్టెంబర్ 10 (ప్రభాత ఉదయం): మణిపూర్‌లో డ్రోణులు, మిసైల్ దాడుల నేపథ్యంలో నిరసనలు, ఆందోళనలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా అయిదు రోజుల పాటు ఇంటర్నెట్ సేవలను నిలిపి వేస్తున్నట్లు మణిపూర్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఆ రాష్ట్ర హోం మంత్రిత్వ శాఖ మంగళ వారం

..మిగతా 2లో

## పూర్తిస్థాయి సోలార్ గ్రామంగా మారనున్న సీఎం రేవంత్ రెడ్డి స్వగ్రామం

### 100 శాతం సౌరశక్తి గ్రామంగా కొండారెడ్డిపల్లిని ప్రోత్సహించాలని నిర్ణయం
### ప్రక్రియను ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వం
### గ్రామంలో పర్యటించి ఇంటింటి సర్వే చేపట్టిన అధికారులు



నాగర్ కర్నూల్, సెప్టెంబర్ 10(ప్రభాత ఉదయం): తెలంగాణలో పూర్తి సౌరశక్తితో నడిచే తొలి గ్రామంగా కొండారెడ్డిపల్లి రూపుదిద్దుకోనుంది. ఈ గ్రామం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వగ్రామం. 100 శాతం సౌరశక్తితో నడిచే ఆవాసాలకు నమూనాగా నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఈ గ్రామాన్ని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అధికారిక ప్రక్రియను ప్రారంభించింది. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అధికారుల

..మిగతా 2లో




## హుస్సేన్ సాగర్‌లో గణపయ్య నిమజ్జనం హైకోర్టు కండిషన్స్

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (ప్రభాత ఉదయం): హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జన వేడుకలపై రాష్ట్ర హైకోర్టు స్పష్టత ఇచ్చింది. 2021లో రూపొందించిన మార్గదర్శకాలనే పాటించాలని సూచించింది. మట్టి, ఎకో ఫ్రెండ్లీ విగ్రహాలు మాత్రమే నిమజ్జనం చేయాలని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ (పీవోపీ) విగ్రహాలను జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేసిన కృత్రిమ నీటికుంటలోనే నిమజ్జనం చేయాలని

..మిగతా 2లో

## నిబంధనల మేరకే గాంధీ నియామకం

### స్పీకర్ నిర్ణయాన్ని తప్పు పట్టలేం
### బిఆర్‌ఎస్ నేతల్లో విభేదాలకు తాము స్పందించం
### శాసనసభా వ్యవహారాశాఖ మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్, సెప్టెంబర్ 10 (ప్రభాత ఉదయం): పీఏసీ చైర్మన్‌గా అరికపూడి గాంధీ నియామకాన్ని శాసనసభా వ్యవహారాశాఖ మంత్రి శ్రీధర్ బాబు సమర్థించారు. శాసనసభ నియమాల ప్రకారమే పీఏసీ ఛైర్మన్‌ను స్పీకర్ నియమించారని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. సీఎల్పీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నేను భారాస ఎమ్మెల్యేను అని పీఏసీ ఛైర్మన్ అరికెపూడి గాంధీ చెప్పారు. భారాస నేతలతో పీఏసీ ఛైర్మన్‌కు అభిప్రాయభేదాలు ఉంటే మాకేం సంబంధం?. ప్రభుత్వాన్ని నడపాలని ప్రజలు మాకు

..మిగతా 2లో



## తెలంగాణకు 4 మెడికల్ కాలేజీలు

### కేంద్రానికి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి దామోదర

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (ప్రభాత ఉదయం): తెలంగాణలో మరో 4 మెడికల్ కాలేజీలకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. మెదక్, యాదాద్రి, మహేశ్వరం, కుత్బుల్లాపూర్ మెడికల్ కాలేజీలకు కేంద్ర ఆరోగ్యశాఖ మంగళవారం నాడు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తెలంగాణ ప్రభుత్వం దరఖాస్తు చేసిన 4 మెడికల్ కాలేజీలకు పర్మిషన్ ఇవ్వాలని నేషనల్ మెడికల్ కమిషన్‌ను ఆదేశించింది. కాలేజీలకు అనుమతిపై తెలంగాణ ప్రభుత్వానికి కేంద్ర ఆరోగ్య శాఖ నేడు (సెప్టెంబర్ 10న) లేఖ పంపించింది. మంజూరైన నాలుగు కాలేజీలలో ఒక్కో కాలేజీలో 50 ఎంబీబీఎస్ సీట్ల చొప్పున, తెలంగాణలో మరో 200 మెడికల్ సీట్లు అందుబాటులోకి రానున్నాయి. ఈ ఏడాది ఇప్పటికే గద్వాల్, నారాయణపేట్, ములుగు, నర్సంపేట్ మెడికల్ కాలేజీలకు నేషనల్ మెడికల్ కమిషన్ అనుమతి రావడం

..మిగతా 2లో

## బీసీ కులగణనపై హైకోర్టు కీలక ఆదేశాలు



హైదరాబాద్, సెప్టెంబర్ 10 (ప్రభాత ఉదయం): తెలంగాణలో బీసీ కులగణన త్వరగా జరిగేలా చూడాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ.హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్ పై ధర్మసం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫు వాదనలు వినిపించారు నాగుల శ్రీనివాస్ యాదవ్. ఈ క్రమంలో పిటిషనర్ వాదనలకు సానుకూలంగా స్పందించిన ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వానికి కీలక ఆదేశాలు ఇచ్చింది. మూడు నెలల్లో బీసీ కుల గణన చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆ నివేదికను కోర్టుకు సమర్పించాలని కోరింది. తెలంగాణలో

..మిగతా 2లో




## హేమ కమిటీ నివేదికపై ఏం చర్యలు తీసుకున్నారు?

### మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఏం చేశారు
### నాలుగేళ్లుగా ఖాళీగా కూర్చున్నారా..
### కేరళ సర్కార్‌కు హైకోర్టు అక్షింతలు

తిరువనంతపురం, సెప్టెంబర్ 10 (ప్రభాత ఉదయం): హేమ కమిటీ రిపోర్ట్ గత కొన్ని రోజులుగా మలయాళ చిత్ర పరిశ్రమను కుదిపేస్తోంది. ఎంతోమంది నటీమణులు చిత్ర పరిశ్రమలో తాము ఎదుర్కొన్న పరిస్థితులను బయటకు వెళ్లగక్కుతున్నారు. ఈ తరుణంలో కేరళ హైకోర్టు, రాష్ట్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తంచేసింది. మలయాళ చిత్ర పరిశ్రమలో లైంగిక వేధింపులను ఆ కమిటీ బయటపెట్టిన తర్వాత కూడా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంపై తీవ్ర వ్యాఖ్యలు చేసింది. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు మీరు ఏం చేస్తున్నారని ప్రశ్నించింది. నాలుగేళ్లు ఖాళీగా కూర్చున్నారా..? అంటూ ప్రభుత్వం తీరుపై ఆందోళన వ్యక్తంచేసింది. రాష్ట్రం

..మిగతా 2లో



# దేశంలోనే తెలంగాణ యంగెస్ట్ స్టేట్

మొదటి పేజీ తరువాయి...

పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి సహాయం అందించాలని డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క 16వ ఆర్థిక సంఘాన్ని కోరారు. నేడు ప్రజా భవన్‌లో నిర్వహిస్తున్న 16వ ఫైనాన్స్ కమిషన్ సమావేశంలో భట్టి మాట్లాడుతూ.. పన్నుల నుంచి తెలంగాణకు వచ్చే ఆదాయం వాటాను 41శాతం నుంచి 50శాతానికి పెంచాలని కోరారు. రైతు భరోసా, రైతు రుణమాఫీ రాష్ట్రానికి జీవరేఖ లాంటివని.. ఈ రాష్ట్ర ప్రజలకు ఆర్థిక భరోసాలు, అధిక భద్రతను కల్పిస్తాయన్నారు. కేంద్ర పథకాలను వినియోగించుకోవాలంటే తరచూ కఠినమైన నిబంధనలు విధిస్తున్నారన్నారు. ఫలితంగా కేంద్ర ప్రాయోజిక పథకాలను పొందడంలో రాష్ట్రాలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయన్నారు. రాష్ట్రాలు తమ అవసరాలు కనుగుణంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను రూపొందించడానికి స్వయం ప్రతిపత్తిని అందించాలని భట్టి కోరారు. తెలంగాణ రాష్ట్రం కీలక దశలో ఉన్నదని... వేగంగా అడుగులు వేస్తోందన్నారు. గత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి 6.85 లక్షల కోట్లకు పైగా రుణభారంతో సతమతం అవుతున్నదన్నారు. సెస్‌లు, సర్ చార్జీల్లో రాష్ట్రాలకు వాటా ఇవ్వాలన్నారు. స్థూల పన్ను ఆదాయంలో రాష్ట్రాల వాటా



తక్కువగా ఉన్నదని పేర్కొన్నారు. సంక్షేమ కార్యక్రమాలను బలోపేతం చేయడం మౌలిక సదుపాయాల కల్పన ద్వారా అంతరాలను పరిష్కరించడానికి అవకాశం ఉందన్నారు. ఇది తెలంగాణ డిమాండ్ కాదని.. అన్ని రాష్ట్రాలకు సంబంధించినదని పేర్కొన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రమని... చారిత్రిక కారణాల వల్ల అసమాన అభివృద్ధి ఇక్కడ ఉన్నదని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. తలసరి ఆదాయం ఎక్కువ ఉన్నప్పటికీ సంపద, ఆదాయం మధ్య పెద్ద అంతరం ఉందని వెల్లడించారు. ఇలాంటి అసమానతల మూలంగానే రాష్ట్ర సాధన ఉద్యమం ప్రారంభమైందన్నారు. సమానతల పరిష్కారానికి మౌలిక సదుపాయాలు, సంక్షేమ రంగంపై గణనీయంగా ఖర్చు చేయాల్సి ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు.

## నిబంధనల మేరకే గాంధీ నియామకం

మొదటి పేజీ తరువాయి...

తీర్పు ఇచ్చారని అన్నారు. ఫలితాల తర్వాత కూడా ఏదో జరుగుతుందని భారాస నేతలు కొన్ని రోజులు తిరిగారు. అంత తిరిగిన తర్వాత కూడా ప్రజలు మరోసారి తీర్పు ఇచ్చారు. భారాస వైఖరి మారలేదని చెప్పి.. లోక్‌సభ ఎన్నికల్లో జీరో తీర్పు ఇచ్చారు. జీరో ఎంపీ సీట్లు ఇచ్చినా కూడా ఆ పార్టీ వైఖరి మారలేదు. రాజ్యాంగ స్ఫూర్తి గురించి మాట్లాడే నైతిక హక్కు భారాసకు లేదు. ఇప్పటికైనా భారాస నేతలు వ్యవస్థలను గౌరవించాలని శ్రీధర్‌బాబు సూచించారు. ప్రతిపక్ష నాయకుడిని పీఏసీ చైర్మన్‌గా నియమించినట్టు అర్థం చేసుకుంటున్నామన్నారు. రాజ్యాంగ స్ఫూర్తితో, రూల్ బుక్ ప్రకారమే స్పీకర్ నిర్ణయం తీసుకున్నారని భావిస్తున్నామన్నారు. స్పీకర్ నిర్ణయంలో తాము జోక్యం చేసుకోమన్నారు. స్పీకర్ విషయంలో కూడా అడ్డగోలుగా మాట్లాడడం మంచి పద్ధతి కాదన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను బీఆర్ఎస్ ప్రభుత్వం కూల్చేసిందని వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వం పీఏసీ చైర్మన్‌గా ఎవరిని నియమించిందో అందరికీ తెలుసన్నారు. తాను బీఆర్ఎస్ పార్టీ సభ్యుడిని అని గాంధీ చెప్పుకున్నారని.. తాను బీఆర్ఎస్ నాయకుడిని అని గాంధీ చెప్తుంటే కాదని బీఆర్ఎస్ నాయకులు చెబుతున్నారన్నారు. ఆ పార్టీ నాయకుల మధ్య సఖ్యత లేకపోతే తాము ఏం చేస్తామన్నారు. పీఏసీ చైర్మన్‌కు ఆ పార్టీ నాయకులకు ఏమైనా సమస్యలు ఉన్నాయో తమకేం తెలుసని వ్యాఖ్యలు చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమే తాను సీఎంని కలిశా అని గాంధీ చెప్పారన్నారు. పొద్దున, మాధ్యాహ్నం తేడా లేకుండా మాట్లాడేది ఇద్దరే అని... కేటీఆర్, హరీష్ తప్ప ఆ పార్టీలో మాట్లాడే నాయకులే లేరా అని ప్రశ్నించారు. అసలు బీఆర్ఎస్ పార్టీలో ప్రజాస్వామ్యం ఉందా అని ప్రశ్నించారు. ఆ పార్టీలో ఇద్దరు తప్పా నాయకులు ఎవరూ లేరా అని నిలదీశారు. ఎమ్మెల్యే పార్టీ మార్పుపై హైకోర్టు ఇచ్చిన తీర్పుపై శ్రీధర్ బాబు స్పందిస్తూ.. 'కోర్టు పరిధిలో ఉన్న అంశాలని తాము మాట్లాడలేం కదా. కోర్టులను మేం తప్పకుండా గౌరవిస్తాం. ఏం చేయాలో హైకోర్టు చెప్పలేదు. నాలుగు వారాల్లో పక్రియ మొదలు పెట్టాలని చెప్పింది. లెజిస్లేచరి వ్యవస్థలో న్యాయ వ్యవస్థ జోక్యం ఎంత వరకు ఉంటుంది అనే అంశంపై చర్చ జరుగుతోంది. 10 షెడ్యూల్ ప్రకారం ఇంత టైంలో నిర్ణయం జరగాలని చెప్పలేదని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. కాగా.. అసెంబ్లీ ప్రజా పద్దుల కమిటీ (పీఏసీ) చైర్మన్‌గా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ నియమితులయ్యారు. ఆయనతో పాటు అంచనాల కమిటీకి కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డిని, ప్రభుత్వరంగ సంస్థల కమిటీకి షాద్‌నగర్ ఎమ్మెల్యే కె.శంకరయ్యను చైర్మన్‌లుగా అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ నియమించారు. తెలంగాణ శాసనసభ, శాసనమండలి బిజినెస్ రూల్స్ ప్రకారం ఈ మూడు కమిటీలకు ఎన్నికలు జరిగినట్లు అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులు వెల్లడించారు. ప్రతి కమిటీకి శాసనసభ నుంచి 9 మంది, శాసనమండలి నుంచి నలుగురు ఎన్నికైనట్లు పేర్కొన్నారు. పీఏసీకి ఎన్నికైన సభ్యుల నుంచి అరికెపూడి గాంధీని, అంచనాల కమిటీకి ఎన్నికైన సభ్యుల నుంచి నలమాద పద్మావతి రెడ్డిని, ప్రభుత్వరంగ సంస్థల కమిటీకి ఎన్నికైన సభ్యుల నుంచి కె.శంకరయ్యను ఆయా కమిటీలకు చైర్మన్లుగా స్పీకర్ ప్రసాద్‌కుమార్ నియమించినట్లు తెలుపుతూ సోమవారం బులెటిన్ విడుదల చేశారు.

## హేమ కమిటీ నివేదికపై ఏం చర్యలు తీసుకున్నారు?

మొదటి పేజీ తరువాయి...

ఉదాసీన వైఖరి మమ్మల్ని ఆందోళనకు గురిచేస్తోంది. ఒక కమిటీ వేసి, నాలుగేళ్లు ఖాళీగా కూర్చున్నారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు మీరు ఏం చేస్తున్నారు..? మనలాంటి రాష్ట్రంలో ఇలాంటి పరిస్థితి ఉండటం దారుణం. మన రాష్ట్రంలో మహిళల జనాభానే అధికం. ఈ వేధింపుల వ్యవహారం చిన్న విషయం కాదు. సిట్ అన్ని విషయాలను పరిగణనలోకి తీసుకోవాలి' అని కోర్టు పేర్కొంది. అలాగే ప్రభుత్వం మౌనాన్ని ఒక అవకాశంగా చూడొద్దని, ఈ వివక్షాపూరిత పరిస్థితులు మారాలని స్పష్టం చేసింది. ప్రస్తుతం ఉన్న చట్టాలతో సమస్యలకు పరిష్కారం లభించకపోతే.. కొత్త చట్టాలను తీసుకురావడం గురించి ప్రభుత్వాలు యోచించాలని సూచించింది. 2017లో కొచ్చిలో మలయాళ నటి కిడ్నాప్ కేసు సంచలనం సృష్టించింది. రౌడీలతో ఆమెపై లైంగిక వేధింపులు జరిపినట్లు నటుడు దిలీప్‌పై ఆరోపణలు వచ్చాయి. ఆ కేసులో అతడు అరెస్టు అయ్యాడు. ఈ నేపథ్యంలో మాలీవుడ్‌లో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సమస్యలపై అధ్యయనం చేసేందుకు కేరళ ప్రభుత్వం 2019లో జస్టిస్ హేమ నేతృత్వంలో కమిటీని ఏర్పాటుచేసింది. ఇటీవల ఈ కమిటీ మలయాళ చిత్ర పరిశ్రమలో మహిళల స్థితిగతులపై పలు దిగ్భ్రాంతికర విషయాలను నివేదికలో పేర్కొంది. సినీ పరిశ్రమలో మహిళల సమస్యలు, వర్కింగ్ కండిషన్లు, రెమ్యూనరేషన్, సాంకేతికరంగంలో మహిళల భాగస్వామ్యం మొదలైన విషయాలపై అధ్యయనం చేసిన కమిటీ.. పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంది. పలువురు సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం 235 పేజీల నివేదికను కేరళ ప్రభుత్వానికి సమర్పించింది. ఈ నివేదిక బయటకు వచ్చిన తర్వాత పలువురు నటీమణులు తాము ఎదుర్కొన్న వేధింపులను బయటకు వెల్లడించారు. ఈ ఆరోపణలు కేరళలో సంచనలం సృష్టించాయి. దాంతో కేరళ చిత్రసీమకు చెందిన అసోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీ ఆర్టిస్ట్స్‌కు మోహన్‌లాల్‌తో సహా ఇతర సభ్యులు రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. మరోవైపు, నటీమణుల ఆరోపణలు తీవ్రమైన నేపథ్యంలో వాటిని విచారించేందుకు ముఖ్యమంత్రి విజయన్ ఏడుగురు సభ్యులతో సిట్ ఏర్పాటుచేస్తున్నట్లు ఇప్పటికే ప్రకటించారు.

## పూర్తిస్థాయి సోలార్ గ్రామంగా మారనున్న సీఎం రేవంత్ రెడ్డి స్వగ్రామం

మొదటి పేజీ తరువాయి...

బృందం మంగళవారం గ్రామంలో ఇంటింటి సర్వే చేపట్టింది. టీజీఎస్పీడీసీఎల్ చైర్మన్, ఎండీ ముషారఫ్ ఫరూఖీ, నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ సంతోష్, రెడ్కో వీసీ, ఎండీ అనిల్, సంస్థ డైరెక్టర్ కె.రాములు, ఇతర శాఖల ముఖ్య అధికారులు ఈరోజు కొండారెడ్డిపల్లి గ్రామంలో పర్యటించారు. గ్రామస్తులు, రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులతో అధికారులు మాట్లాడి, ఈ పైలట్ ప్రాజెక్టు వివరాలు తెలిపారు. ఈ గ్రామంలో దాదాపు 499 గృహ వినియోగదారులు, 66 వాణిజ్య వినియోగదారులు, 867 వ్యవసాయ వినియోగదారులు, ఇతర కేటగిరిలతో కలుపుకుని మొత్తం 1,451 వినియోగదారులు ఉన్నారు. ఈ మోడల్ ప్రాజెక్ట్ అమలు చేసేందుకు నేడు ఇంటింటి సర్వేను ప్రారంభించారు. ఈ సర్వే ద్వారా గ్రామానికి అవసరమైన సౌర విద్యుత్ కెపాసిటీని అంచనా వేసి డీపీఆర్ తయారు చేసి, ఇతర ప్రక్రియలను ముందుకు తీసుకెళ్లనున్నారు.

## మణిపూర్‌లో మరోమారు ఆందోళన

మొదటి పేజీ తరువాయి...

ఆదేశాలు జారీ చేసింది. ఇంటర్నెట్ సేవలు తిరిగి 16వ తేదీన పునరిద్ధరిస్తామని ఆ దేశాల్లో స్పష్టం చేసింది. ఇటీవల జరిగిన డ్రోణులు, మిసైల్ దాడుల వెనుక ఉన్న వారిని వెంటనే అరెస్ట్ చేయ్యాలని డిమాండ్ చేస్తూ.. సోమవారం మణిపూర్ రాజధాని ఇంఫాల్‌లోని కైరావన్‌బంద్ మహిళా మార్కెట్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఈ ఆందోళనలో వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. మణిపూర్ ప్రాదేశికతతోపాటు పరిపాలన సమగ్రతను కాపాడాలంటూ వారంతా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. డీజీపీతోపాటు రాష్ట్ర ప్రభుత్వ భద్రతా సలహాదారుని తొలగించాలని డిమాండ్ చేస్తూ.. మంగళవారం నిరసనకారులు ఆందోళన చేపట్టారు. అందులోభాగంగా వారంతా రాజ్‌భవన్ వైపు వెళ్లేందుకు యత్నించారు. దీంతో వారిని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద భద్రతా దళాలు నిలువరించాయి. ఆ క్రమంలో ఆందోళనకారులు, భద్రతా దళాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. దాంతో ఆందోళనకారులపై భద్రత దళాలు టియర్ గ్యాస్ ప్రయోగించాయి. దాడులకు నిరసనగా మణిపూర్ యూనివర్శిటీ విద్యార్థులు సైతం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా దిష్టి బొమ్మను దహనం చేశారు. విద్యార్థుల ఆందోళనలు, నిరసనల కారణంగా మధ్య తూర్పు, పశ్చిమ ఇంఫాల్ జిల్లాల్లో కర్ఫ్యూను పోలీసులు విధించారు. దాదాపు 16 నెలల క్రితం మణిపూర్‌లో రెండు తెగల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణల కారణంగా దాదాపు 200 మందికిపైగా ప్రజలు మరణించారు. అలాగే వేలాది మంది నిరాశ్రయులయ్యారు. ఆ తర్వాత పరిస్థితి సద్దుమణిగిందని భావిస్తున్న తరుణంలో సెప్టెంబర్ 6వ తేదీన మళ్లీ డ్రోణులు, మిసైల్ దాడుల్లో చోటు చేసుకున్నాయి. ఈ సందర్భంగా చోటు చేసుకున్న హింసలో 8 మంది మరణించగా.. 12 మంది తీవ్రంగా గాయపడ్డారు.

## దేశాభివృద్ధిలో సైబర్ సెక్యూరిటీ కీలక భూమిక

మొదటి పేజీ తరువాయి...

కేంద్ర, రాష్ట్ర లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల ప్రతినిధులతో సైబర్ ఫ్రాడ్ మిటిగేషన్ సెంటర్ (సీఎఫ్ఎంఎస్)ను ఏర్పాటు చేస్తామని అమిత్‌షా ప్రకటించారు. ఈ ఏజెన్సీలు ఆన్‌లైన్ ఆర్థిక నేరాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు కలిసికట్టుగా తక్షణ చర్యలకు దిగుతాయన్నారు. లా ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో 'సహకార సమాఖ్య'కు ఒక ఉదాహరణగా సీఎఫ్ఎంసీ సేవలందిస్తుందన్నారు. మేవాత్, జామ్‌తాఢా, అహ్మదాబాద్, హైదరాబాద్, ఛండీగఢ్, విశాఖపట్నం, గౌహతిలలో ఏర్పాటు చేసిన ఏడు జాయింట్ సైబర్ కోఆర్డినేషన్ టీమ్‌లు మంచి ఫలితాలను ఇస్తున్నట్టు అమిత్‌షా చెప్పారు. 'సైబర్ కమాండోస్' ప్రోగ్రాం కింద రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, సీబీఐ వంటి సెంట్రల్ పోలీస్ ఆర్గనైజేషన్లకు చెందిన సుశిక్షితులతో ప్రత్యేక వింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. సైబర్ సెక్యూరిటీకి ఎదురవుతున్న ముప్పును ఈ టీమ్ సమర్థవంతగా ఎదుర్కొంటుందన్నారు. డిజిటల్ స్పేస్‌ను సురక్షితంగా ఉంచడంలో రాష్ట్రాలు, కేంద్ర సంస్థలకు ట్రైన్డ్ సైబర్ కమాండోలు సహకరిస్తారని చెప్పారు. ప్రపంచంలో జరిగే లావాదేవీల్లో 46 శాతం ఇండియాలోనే జరుగుతున్నందున సైబర్ ప్రపంచాన్ని సురక్షితంగా మార్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం చేశారు.

## తెలంగాణకు 4 మెడికల్ కాలేజీలు

మొదటి పేజీ తరువాయి...

తెలిసిందే. కేంద్రం తాజా నిర్ణయంతో రాష్ట్రంలో మొత్తం 8 కాలేజీల్లో కలిపి 400 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వచ్చాయి. కొత్త సీట్లతో కలుసుకుని తెలంగాణలో ప్రభుత్వ కాలేజీల్లోని మొత్తం సీట్ల సంఖ్య 4090 కానున్నాయి. తెలంగాణ ప్రభుత్వం ఈ ఏడాది మొత్తం 8 కాలేజీలకు అనుమతి కోరుతూ దరఖాస్తు చేసింది. జూన్‌లో ఈ కాలేజీల పరిశీలనకు వచ్చిన నేషనల్ మెడికల్ కమిషన్ అధికారులు, ఇక్కడ అవసరమైన సౌకర్యాలు లేవని అసంతృప్తి వ్యక్తం చేశారు. టీచింగ్ స్టాఫ్, సౌకర్యాలు లేకుండా తాము అనుమతులు ఇవ్వలేమని ఎన్ఎంసీ స్పష్టం చేసింది. సంబంధిత శాఖ అధికారులు ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. కొత్త కాలేజీల మంజూరు కోసం చేయాల్సిన ఏర్పాట్లకు అవసరమైన నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించింది. కొత్తగా మెడికల్ కాలేజీలకు అనుమతులు ఇచ్చిన కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా కృతజ్ఞతలు తెలిపారు. కాలేజీల ఏర్పాటు కోసం సకాలంలో అవసరమైన నిధులు కేటాయించిన సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, డాక్టర్ వాణి, అడిషనల్ డీఎంఈ, ఇతర ఉన్నతాధికారులను మంత్రి దామోదర అభినందించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను డెవలప్ చేసి, ప్రజలకు మెరుగైన ఉచిత వైద్య సేవలు అందించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

### ఫస్ట్ అప్పీల్‌తో 4 కాలేజీలకు అనుమతి

గతంలో నేషనల్ మెడికల్ కమిషన్ చూపించి లోపాలను సవరించిన తెలంగాణ ప్రభుత్వం ఫస్ట్ అప్పీల్‌కు వెళ్లింది. ఆ అప్పీల్ కారణంగా గద్వాల్, నారాయణపేట్, ములుగు, నర్సంపేట్ మెడికల్ కాలేజీలకు ఎన్ఎంసీ పర్మిషన్ ఇచ్చింది. మిగిలిన 4 కాలేజీలకు పర్మిషన్ మాత్రం రాలేదు. దాంతో మిగతా 4 కాలేజీలకు అనుమతులపై తెలంగాణ ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా ఎప్పటికప్పుడూ మానిటర్ చేశారు. మహేశ్వరం, కుత్బుల్లాపూర్, యాదాద్రి, మెదక్ మెడికల్ కాలేజీలకు స్టాఫ్‌ను నియమించారు. ఇటీవల జరిగిన జనరల్ ట్రాన్స్‌ఫర్లలో తొలుత ఆ నాలుగు మెడికల్ కాలేజీల్లోని ఖాళీలను నింపి, ఆ తర్వాతే మిగిలిన కాలేజీల్లోకి సిబ్బందిని బదిలీ చేసింది ప్రభుత్వం. ప్రొఫెసర్ల కొరతను అధిగమించేందుకు అర్హత ఉన్న వారికి ప్రమోషన్లు ఇచ్చారు. మెడికల్ కాలేజీతో పాటు అక్కడి హాస్పిటల్‌లో ఉండాల్సిన లాబోరేటరీ, డయాగ్నస్టిక్స్ ఎక్విప్‌మెంట్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఇలా ఎన్ఎంసీ లేవనెత్తిన అన్ని లోపాలను సవరించి కేంద్ర ఆరోగ్యశాఖకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ అధికారులు సెకండ్ అప్పీల్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నర్సింహా ఆదేశాలతో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తూ, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, డాక్టర్ వాణి, ఇతర ఆఫీసర్లు, డాక్టర్ల బృందం ఢిల్లీకి వెళ్లి కేంద్ర ఆరోగ్యశాఖ, ఎన్ఎంసీ అధికారులను కలిశారు. కాలేజీల ఏర్పాటుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించామని, ఇంకేమైనా అవసరం ఉంటే అవి కూడా సమకూర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వివరించారు. ఈ నేపథ్యంలోనే మొత్తం అన్ని కాలేజీలకు అనుమతులు ఇవ్వాలని కేంద్ర ఆరోగ్య శాఖ నిర్ణయించింది. లెటర్ ఆఫ్ పర్మిషన్ జారీచేయాలని ఎన్ఎంసీని ఆదేశించింది.



## కోఠి మహిళా యూనివర్శిటీకి చాకలి ఐలమ్మ పేరు

### మహిళా కమిషన్ సభ్యురాలిగా ఐలమ్మ మనుమరాలు

### చాకలివర్ధంతి కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (ప్రభాత ఉదయం): చాకలి ఐలమ్మ స్ఫూర్తితో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం నడుస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కోఠిలోని మహిళా యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు పెట్టాలని నిర్ణయించామని, చాకలి ఐలమ్మ మనుమరాలు శ్వేతను మహిళా కమిషన్ సభ్యురాలిగా నియమించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు సీఎం ప్రకటించారు. రవీంద్రభారతిలో మంగళవారం సాయంత్రం జరిగిన చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమంలో సీఎం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పుంజాల అలేఖ్య నేతృత్వంలో చాకలి ఐలమ్మ నృత్య నాటిక ప్రదర్శనను సీఎం రేవంత్‌రెడ్డి వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐలమ్మ కుటుంబ సభ్యులు ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉండాలని మా ప్రభుత్వం భావిస్తోందన్నారు. తెలంగాణలో ఐలమ్మ స్ఫూర్తిని కొనసాగిస్తామని అన్నారు. దొరల చేతుల్లో ఉన్న వేలాది ఎకరాలను పేదలకు చేరాలని ఐలమ్మ పోరాటం చేశారని, చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ఇందిరా గాంధీ భూ సంస్కరణలు తెచ్చారని ఆయన చెప్పారు. భూమి పేదవాడి ఆత్మగౌరవం..అందుకే ఇందిరమ్మ పేదలకు లక్షల ఎకరాలను పంచిపెట్టారని, అయితే, ధరణి ముసుగులో కొందరు పేదల భూములను గుంజుకునే కుట్ర చేశారని ఆయన ఆరోపించారు. పేదల భూములను కాపాడేందుకే ఐలమ్మ స్ఫూర్తితో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని సీఎం అన్నారు. రవీంద్రభారతిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు డి. శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.




## హుస్సేన్‌సాగర్‌లో గణపయ్య నిమజ్జనం హైకోర్టు కండిషన్స్

మొదటి పేజీ తరువాయి...

ఆదేశించింది. గత రెండేళ్లలో హైకోర్టు ఆదేశాలను ధిక్కరించారని పిటిషనర్ మామిడి వేణుమాధవ్ పేర్కొన్నారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం, ధిక్కరణ పిటిషన్ ఇంత ఆలస్యంగా ఎందుకు వేశారని కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. 2021లో రూపొందించిన మార్గదర్శకాల ప్రకారం నిమజ్జనాలు జరగట్లేదని పిటిషనర్ పేర్కొన్నారు. నిమజ్జనాల కోసం ట్యాంక్ బండ్‌పై భారీ క్రేన్లు నిలుపుతున్నారని, వీటి వల్ల ట్యాంక్ బండ్‌కు ముప్పు ఉందని తెలిపారు. వాదనలు విన్న న్యాయస్థానం, 2021లో రూపొందించిన మార్గదర్శకాల ప్రకారమే నిమజ్జనాలు జరపాలని తేల్చి చెప్పింది. పీవోపీ విగ్రహాలను సహజ జలవనరుల్లో నిమజ్జనం చేయొద్దు : వాదనలకు తగిన ఆధారాలను చూపించాలని పిటిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. గత రెండేళ్లలో మార్గనిర్దేశకాలను ఉల్లంఘించినట్లు భావిస్తే ఇంత ఆలస్యంగా హైకోర్టును ఎందుకు ఆశ్రయించారని ఆగ్రహం వ్యక్తం చేసింది. గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి సంబంధించి 2021లోనే మార్గనిర్దేశకాలున్నాయని, 2022లో జరిగిన విచారణ సందర్భంగా నిమజ్జనంపై పిటిషనర్‌తో పాటు హైకోర్టు సైతం సంతృప్తి వ్యక్తం చేసిందని ధర్మాసనం తెలిపింది. హుస్సేన్‌సాగర్‌లో కేవలం మట్టి గణపతులు, పర్యావరణహిత విగ్రహాలు మాత్రమే నిమజ్జనం చేయాలని మార్గనిర్దేశకాలున్నాయని పేర్కొంది. పీవోపీ విగ్రహాలను సహజ జలవనరుల్లో నిమజ్జనం చేయొద్దని ఆదేశాలు జారీచేసింది. ట్యాంక్‌బండ్ మీద నుంచి కాకుండా ఎన్టీఆర్ మార్గ్, పీవీ మార్గ్, సంజీవయ్య పార్కుల పరిసరాల్లో విగ్రహాలను నిమజ్జనం చేయాలని తెలిపింది. ఇప్పుడు జరిగే నిమజ్జనంలో కోర్టు ఉత్తర్వులు ఉల్లంఘిస్తున్నారని భావిస్తే ఆధారాలతో సహా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని పిటిషనర్‌కు హైకోర్టు సూచించింది. ఈ మేరకు వేణుమాదవ్ దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించింది.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి మరువలేం

మొదటి పేజీ తరువాయి...

భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడి తెలంగాణ ప్రజల తెగువను, పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన నిప్పుకణిక మన తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ అని హరీశ్ రావు అన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా వారికి ఘనంగా నివాళు లర్పించారు. నాటి తెలంగాణ సాయుధ పోరాట కాలంలో ఆ యోధురాలు ప్రదర్శించిన ధైర్య సాహసాలు, చైతన్యం నేటి తరానికీ ఎంతో స్ఫూర్తి అని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం చాకలి ఐలమ్మ త్యాగాలకు గుర్తుగా వారి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించి అమలు చేసింది. భావితరాలకు ఆ మహనీయురాలి చరిత్ర తెలువాలని పాఠ్యాంశంగా పెట్టి గౌరవించిందని ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.

## బీసీ కులగణనపై హైకోర్టు కీలక ఆదేశాలు

మొదటి పేజీ తరువాయి...

ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయనేదే దానిపై చర్చ జోరుగా జరుగుతోంది. ఇప్పటికే సర్పంచుల పదవి కాలం ముగిసిన ఇంకా ఎన్నికలకు సంబంధించిన ఎలాంటి అప్డేట్ ను ప్రభుత్వం ప్రకటించలేదు. కాగా కులగణన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరపనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తో సహా పలువురు కీలక నేతలు ఇప్పటికే ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. అయితే, స్థానిక సంస్థలు ఎన్నికలు వెంటనే జరపాలని ప్రభుత్వాన్ని ప్రతిపక్షాల నుంచి ప్రభుత్వానికి ఒత్తిడి వస్తోంది. అయితే, దసరా తరువాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. తాజాగా హైకోర్టు కూడా బీసీ కులగణనపై ఆదేశాలు ఇవ్వడంతో దీనిపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

### బీసీ కమిషన్ ఏర్పాటు..

ఇటీవల తెలంగాణ ప్రభుత్వం సీనియర్ నేత నిరంజన్ చైర్మన్ గా నలుగురు సభ్యులతో బీసీ కమిషన్ ను ఏర్పాటు చేసింది. కులగణన చేపడతామని బాధ్యతల స్వీకరణ సమయంలో చైర్మన్ ప్రకటించారు. దీంతో ప్రభుత్వం సైతం బీసీ కులగణనకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే.. స్థానిక ఎన్నికల తర్వాతనా? లేక ఇప్పుడా? అన్న విషయంలోనే క్లారిటీ రావాల్సి ఉంది. ప్రస్తుత హైకోర్టు తీర్పు నేపథ్యంలో కులగణన తర్వాతనే ప్రభుత్వం స్థానిక ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉందన్న చర్చ సాగుతోంది. మరికొన్ని రోజుల్లో ఈ అంశంపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

# హిమాయత్ సాగర్ సర్వీస్ రోడ్డులో 254 కిలోల గంజాయి, ఒక పిస్తల్, 11 తూటాలు, రెండు కార్లు స్వాధీనం




వివరాలు వెల్లడిస్తున్న రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్







స్వాధీనం చేసుకున్న కార్లు



స్వాధీనం చేసుకున్న పిస్తల్, 11 తూటాలు

### ఉత్తర్ ప్రదేశ్ కు చెందిన ఐదుగురు ముఠా సభ్యుల అరెస్ట్ - ఇద్దరు పరారీ
### వివరాలు వెల్లడించిన రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్

బుద్వేల్, సెప్టెంబర్10(ప్రభాత ఉదయం): అరుకు నుంచి ఉత్తర ప్రదేశ్ , ముంబై ప్రాంతాలకు గంజాయిని తరలిస్తున్న ముఠాను రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హిమాయత్ సాగర్ సర్వీసు రోడ్డులో రాజేంద్రనగర్ పోలీసులు, సైబరాబాద్ ఎస్ ఓటీ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి పట్టుకున్నారు. వారి నుంచి 254 కిలోల గంజాయితోపాటు ఒక పిస్టల్, 11 తూటాలు, ఏడు సెల్ ఫోన్ లు, గంజాయిని తరలించడానికి ఉపయోగించిన రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్, సైబరాబాద్ ఎస్ఓటి డీసీపీ తో కలిసి



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

వివరాలను వెల్లడించారు. ఉత్తరప్రదేశ్ కు చెందిన ఐదుగురు ముఠా సభ్యులు సచిన్ సింగ్, వినోద్ ల నాయకత్వంలో అరుకు నుంచి 254 కిలోల గంజాయిని కొని దానిని యూపీ, ముంబైకి తరలించాలని రెండు ఎర్టీగా కార్లలో తీసుకొని వస్తున్నారు. హిమాయత్ సాగర్ ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్ నెంబర్ 17 వద్ద దిగి సర్వీస్ రోడ్డులో ఒక కారు నుంచి మరొక కారులోకి గంజాయిని మారుస్తుండగా గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు వెళ్లి సచిన్ సింగ్, వినోద్ లతోపాటు ముంబైకి చెందిన సలీం, నదీమ్, సక్లెమ్ లను అరెస్టు చేసినట్లు తెలిపారు. అరుకు కు చెందిన రాజు నుంచి గంజాయి ని తీసుకు వస్తున్నట్లు ఒప్పుకున్నారన్నారు. ఇప్పటి వరకు సచిన్ ముఠా ఒకసారి 100 కిలోలు, ఒకసారి 90 కిలోలు, మరొక సారి 80 కిలోల గంజాయి ని సరఫరా చేసినట్లు ఒప్పుకున్నారన్నారు. గంజాయి లాంటి మత్తు పదార్థాల గురించి తెలిసినా, ఎలాంటి సమాచారం ఉన్నా, 100కు డయల్ చేయాలని, లేకపోతే సైబరాబాద్ వాట్సప్ నెంబర్ 9490617444 కు సమాచారం అందించాలని డీసీపీ చింతమనేని శ్రీనివాస్ తెలిపారు .

**కాల్పులు జరగలేదు :**

గంజాయి ముఠా ను పట్టుకున్న సమయంలో వారు పోలీసులపై కాల్పులు జరిపారని మీడియాలో వచ్చిందని దాంట్లో వాస్తవం లేదన్నారు. సంఘటన స్థలానికి మొదటగా వచ్చిన మీడియా ప్రతినిధి గంజాయి తగిలిస్తున్న కారు అద్దం పగిలి ఉండడానికి చూసి ఫైర్ జరిగిందని భావించాడని ఎలాంటి ఫైర్ జరగలేదన్నారు.



అగ్రి, అగ్రి ఇంజనీరింగ్ కౌన్సిలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేస్తున్న రిజిస్టర్ రఘురాంరెడ్డి

## అగ్రిసెట్, అగ్రి ఇంజనీరింగ్ సెట్-2024 ఫలితాలు విడుదల

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 10(ప్రభాత ఉదయం) ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్వహించిన అగ్రిసెట్, అగ్రి ఇంజనీరింగ్ సెట్ - 2024 ఫలితాలను మంగళవారం విడుదల చేశారు. రాజేంద్రనగర్ లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో జరిగిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి రఘురామిరెడ్డి అగ్రిసెట్ %ఌ% అగ్రి ఇంజనీరింగ్ - 2024 ఫలితాలను విడుదల చేశారు. ఈ అగ్రిసెట్ ను గత నెల 24న నిర్వహించడం జరిగింది. అగ్రిసెట్ %ఌ% అగ్రి ఇంజనీరింగ్ సెట్ లో అర్హత సాధించిన అభ్యర్థుల మెరిట్ జాబితాను రిజిస్ట్రార్ విడుదల చేశారు.

## దిల్‌శుక్‌నగర్ ఎస్‌జిఆర్ టవర్‌లో ఘనంగా వినాయక చవితి వేడుకలు

దిల్‌శుక్‌నగర్, సెప్టెంబర్ 10 (ప్రభాత ఉదయం) దిల్ శుక్ నగర్ పి అండ్ టి కాలనీలో గల ఎస్ జి ఆర్ టవర్స్ లో నెలకొల్పిన విగ్నేశ్వరుడికి అపార్ట్మెంట్ వాసులు ఘనంగా పూజలు నిర్వహిస్తున్నారు. ఎస్ జి ఆర్ టవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అసోసియేషన్ అధ్యక్షులు రవి చారి ఆధ్వర్యంలో కార్యదర్శి సందీప్ కోశాధికారి నరేష్ సభ్యులు రామ్ చంద్రరావు ,పద్మనాభం ,శ్రీనివాస్ ,ఉమా సుందరి, హరిత ,పద్మ, శ్రీ పదమ, సుప్రియ లు విగ్నేశ్వరుడికి ప్రతిరోజు వివిధ పూజలు నిర్వహిస్తూ భక్తిని చాటుకుంటున్నారు.



విఘ్నేశ్వరుడి పూజలో పాల్గొన్న అపార్ట్మెంట్ వాసులు



శివరాంపల్లిలోని డీఎంహెచ్ ఓ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న ఆశ వర్కర్లు

## ఆశా వర్కర్లకు పారితోషికాలను వెంటనే చెల్లించాలి: జి. కవిత డిమాండ్

బుద్వేల్, సెప్టెంబర్10(ప్రభాత ఉదయం): రంగారెడ్డి జిల్లాలో 1100 మంది ఆశా వర్కర్లకు 9 నెలలుగా ఇవ్వాల్సిన పారితోషకాలు వెంటనే చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర అంగన్వాడీ టీచర్స్ వర్కర్స్ హెల్పర్స్ వాలంటీర్స్ సంఘం (సిఐటియు) రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు జి కవిత డిమాండ్ చేశారు. ఇదే విషయమై శివరాంపల్లిలోని రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ముందు సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాలితోషికాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ఆశా వర్కర్లకు 9 నెలలుగా వాటిని చెల్లించకుండా కాలియాపన చేస్తుండటం ఏంటని ప్రశ్నించారు . ప్రభుత్వం పారితోషిఖాలను విడుదల చేసినప్పటికీ అనేక కారణాలను చూపుతూ వైద్య ఆరోగ్యశాఖకు చెందిన అధికారులు వాటిని ఆశా వర్కర్లకు ఇవ్వడం లేదన్నారు. ఆశా వర్కర్లు మగవారిని లెప్రసీ సర్వే చేయాలని చెబుతున్నారని, ఇది ఎలా సాధ్యమని ప్రశ్నించారు. సర్వే చేయకపోతే పారితోషకాలు ఇవ్వమని చెబుతూ ఆశా వర్కర్లను బెదిరిస్తున్నారన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్డులను కూడా ఆశా వర్కర్లే చేయాలని సిస్టర్లు సూచిస్తున్నారని, వాస్తవంగా ఆ పనులు సిస్టర్స్ చేయాలని గుర్తు చేశారు. వీటన్నింటినీ అడ్డం పెట్టుకొని చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న ఆశా వర్కర్ల పారితోషకాలను ఆపుతున్నారన్నారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టిసారించి ఎప్పటికప్పుడు ఆశా వర్కర్లకు పారితోషికాలను ఇప్పించాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఆశా వర్కర్లకు నెలకు ఇస్తామన్న రూ. 18 వేల ఫిక్స్ డ్ వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆశా వర్కర్ల సంఘం రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సునీత, కోశాధికారి లలిత తదితరులు పాల్గొన్నారు.



విగ్నేశ్వరుణ్ణి దర్శించుకుంటున్న భక్తులు



గణనాధునికి పూజలు

## గణనాదునికి పూజలు చేసిన భక్తులు

బుద్వేల్, సెప్టెంబర్10(ప్రభాత ఉదయం): బుద్వేల్ శ్రీ శివ సాయి కాలనీ సుంకర రామ్మోహన్ రావు నివాసంలో ప్రతిష్టించిన గణనాధునికి మంగళవారం కుటుంబ సభ్యులు, పరిసర నివాసాలకు చెందిన భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం సుంకర రామ్మోహన్ రావు నివాసంలో వినాయకుని ప్రతిష్ఠించి 9 రోజులపాటు పూజలు నిర్వహిస్తారు. ప్రతిరోజు పూజలు చేసి, భజనలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేస్తారు.



వినాయకుని దర్శించుకుంటున్న తోకల శ్రీనివాస్ రెడ్డి

## వినాయక మండపాలలో తోకల శ్రీనివాస్ రెడ్డి పూజలు



బుద్వేల్, సెప్టెంబర్10(ప్రభాత ఉదయం): రాజేంద్ర నగర్ నియోజక వర్గం పరిధిలోని పలు వినాయక మండపాలలో గణేష్ నవ రాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని రాజేంద్ర నగర్ నియోజక వర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే, మైలార్ దేవ్ పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి పూజలు నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకులతో కలిసి గణనాథులను దర్శించుకొని ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేస్తున్నానన్నారు. స్వామివారి చల్లని ఆశీస్సులు దీవెనలతో ప్రజలందరు జీవితాంతం ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, పాడి పంటలతో ఆనందంగా ఉండాలని విగ్నేశ్వరుని కోరుకున్నట్లు కార్పొరేటర్ అన్నారు. విఘ్నేశ్వరుడి చల్లని ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.




బుద్వేల్‌లోని రాజేంద్రనగర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్



సుంకర రామ్మోహన్

## బుద్వేల్‌లో గల రాజేంద్రనగర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో 24 గంటలు డాక్టర్లు అందు బాటులో ఉండాలి

బుద్వేల్, సెప్టెంబర్10(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ). ఇది బుద్వేల్ ఫిల్టర్ బెడ్స్ కు ఎదురుగా ఉంటుంది. ఈ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ 30 పడకల ఆసుపత్రిగా రికార్డుల్లో ఉంది. ఇక్కడ కావలసినంత మంది డాక్టర్లు ఉన్నారు. ఫీల్డ్ స్టాఫ్ కూడా బాగానే ఉంది. అన్ని రకాల ల్యాబ్ పరీక్షలు ఇక్కడ నిర్వహిస్తారు. అయితే ఇది కేవలం ఉదయం వేళల్లోనే రోగులను చూస్తోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

**రాజేంద్రనగర్ సర్కిల్ లోని అన్ని ప్రాంతాల నుంచి రోగులు వస్తారు :**

బుద్వేల్ లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కు రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అన్ని ప్రాంతాల నుంచి రోగులు వస్తుంటారు. సర్కిల్ తో పాటు కిస్మత్ పూర్ తదితర ప్రాంతాల నుంచి కూడా వైద్య సేవల కోసం ప్రజలు ఇక్కడికి వస్తుంటారు . అయితే ఈ ఆసుపత్రిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మాత్రమే డాక్టర్లు అందుబాటులో ఉండి రోగులను పరిశీలిస్తారు. అప్పుడు వారికి వైద్య సేవలు అందిస్తారు. ఎలాంటి పరీక్షలు కావాలన్నా ఇక్కడ ల్యాబు లో చేస్తారు. అంతా బాగే ఉన్నప్పటికీ మధ్యాహ్నం తర్వాత ఇక్కడ డాక్టర్లు అందుబాటులో ఉండరు. ఇదే ప్రధాన సమస్య. కేవలం ఒకరు లేదా యిద్దరు నర్సులు, ఒక వాచ్ మెన్ మాత్రమే ఆసుపత్రిలో అందుబాటులో ఉంటారు. అత్యవసర పరిస్థితుల్లో ఎవరైనా ఆసుపత్రికి వస్తే ఇక్కడ చూడడానికి డాక్టర్లు ఉండకపోవడం బాధాకరం.

**పేరుకే 30 పడకల ఆసుపత్రి**

రాజేంద్రనగర్ పేరుతో ఉన్న ఈ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ రికార్డుల్లో 30 పడకల ఆసుపత్రిగా ఉంది . అయితే ఇక్కడ ఇన్ పేషెంట్లను ఎక్కువగా చూడరు. ఎవరికైనా గ్లూకోస్ పెట్టాలంటే పెడుతుంటారు. అప్పుడప్పుడు కొంతమంది పేషెంట్లను మాత్రం చూస్తుంటారు. దీనిపై వైద్య విధాన పరిషత్ ఉన్నతాధికారులు స్పందించి బుద్వేల్ లో గల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంచడమే కాకుండా డాక్టర్లు కూడా అందుబాటులో ఉండేటట్లు చూడాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై ప్రజాప్రతినిధులు కూడా స్పందించి చర్యలు తీసుకోవాలంటున్నారు. ప్రతిరోజు అందరూ డాక్టర్లు విధులకు హాజరయ్యేటట్లు చూడాలని కోరుతున్నారు. కొంతమంది డాక్టర్లు రెండు రోజులు నేను డ్యూటీ చేస్తాను... ఆ తర్వాత మీరు చేయండి అని రోజులను పంచుకుంటూ డ్యూటీ లకు హాజరవుతున్నారు. అలా కాకుండా అన్ని విభాగాల డాక్టర్లు ప్రతిరోజు అందుబాటులో ఉండేటట్లు చూడాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

**సాయంత్రం వేళల్లో డాక్టర్లు ఉండడం లేదు: సుంకర రామ్మోహన్: భవన నిర్మాణ కార్మిక సంఘం**

**తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు :**

బుద్వేల్ లో గల రాజేంద్రనగర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో సాయంత్రం వేళల్లో డాక్టర్లు విధులకు హాజరు కావడం లేదు. మంగళవారం తన మనుమడి కి తీవ్ర జ్వరం ఉండడంతో ఆసుపత్రికి వెళ్లాను . నర్స్ మాత్రమే అక్కడ ఉన్నారు. డాక్టర్లు లేరా అని ఆమెను అడిగితే ఉదయం వేళల్లో మాత్రమే డాక్టర్లు ఉంటారని సమాధానమిచ్చింది. దీంతో నివ్వెర పోవడం తన పని అయింది. సుమారు 5 లక్షల జనాభా ఉన్న రాజేంద్రనగర్ సర్కిల్ ప్రాంతంలో ఉన్న ఒక్కగానొక్క 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో 24 గంటల పాటు డాక్టర్లు అందుబాటులో ఉండేటట్లు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. సాయంత్రం వేళల్లో, రాత్రి సమయాల్లో ప్రజలకు ఏదైనా ఇబ్బందులు వస్తే డాక్టర్లు చూడడానికి అందుబాటులో ఉండాలన్నారు. ఎమర్జెన్సీ ఉంటే పిలిస్తే వస్తారు అని సర్ది చెప్పడం సరికాదన్నారు. మారుమూల గ్రామాలలో 24 గంటలు వైద్య సేవలు అందిస్తున్న ప్రభుత్వం, నగరంలో అంతర్భాగమైన రాజేంద్రనగర్ లో ఎందుకు 24 గంటలు వైద్య సేవలు డాక్టర్ల ద్వారా అందించలేకపోతుందోనని వాపోయారు. దీనిపై ప్రభుత్వం ఆలోచించి రాజేంద్రనగర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో 24 గంటలు డాక్టర్లు అందుబాటులో ఉండేటట్లు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



రాజేంద్రనగర్ లోని జాతీయ వరి పరిశోధన సంస్థలో ప్రతిష్టించిన మూషిక వాహనునికి పూజలు చేస్తున్న ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ రామన్ మీనాక్షి సుందరం తదితరులు

## ఐఐఆర్ఆర్‌లో వినాయకునికి పూజలు

బుద్వేల్, సెప్టెంబర్10(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్ (ఐ ఐ ఆర్ ఆర్)లో ప్రతిష్టించిన మూషిక వాహన గణనాధునికి ఆ సంస్థ శాస్త్రవేత్తలు, ఉద్యోగులు మంగళవారం పూజలు చేశారు. సంస్థ డైరెక్టర్ డాక్టర్ రామన్ మీనాక్షి సుందరం తో పాటు పలువురు శాస్త్రవేత్తలు, ఉద్యోగులు ఈ పూజలలో పాల్గొన్నారు.



వరద బాధితుల కోసం విరాళాల సేకరణ చేపట్టిన భవన నిర్మాణ కార్మిక సంఘం

## వరద బాధితుల కోసం సిఐటియు విరాళాల సేకరణ

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 10(ప్రభాత ఉదయం) సిఐటియు రాజేంద్రనగర్ మండల కమిటీ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ కార్యక్రమం ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భవన నిర్మాణ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు జి కురుమయ్య సిఐటియు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు రాజేంద్రనగర్ మండల కన్వీనర్ జాజాల రుద్ర కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుర్మయ్య, రుద్ర కుమారులు మాట్లాడుతూ... కార్మికులతో కలిసి కాటేదాన్ సిఐటియు ఆఫీసు నుండి కాటేదాన్ ఏరియాలో ఖమ్మం విజయవాడలో అకాల వర్షాలకు నష్టపోయిన కుటుంబాలను ఆదుకోవడం కోసం విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టింది. కార్మికులు నిరంతరం తమ సమస్యల పరిష్కారం కోసం పోరాటం ఆగదు అదేవిధంగా దేశంలో రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాల మీద ఎప్పటికప్పుడు అధ్యయం చేస్తూ కార్మికులు విపత్కర పరిస్థితులలో దేశాన్ని ప్రజలను కాపాడుకుంటూ ఇక్కడ ఎలాంటి ఘటనలు జరిగిన స్పందిస్తూ మానవత దృక్పథంతో ప్రతి ఒక్కరు స్పందించాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆ కాల వర్షాలకు నష్టపోయిన కుటుంబాలను ఆదుకోవాలని వారు డిమాండ్ చేయడం జరిగింది.. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు సోమల నాయక్ ,మన్యం, రవికుమార్ .కేశవులు. శేఖర్ ,కొండయ్య ,నిరంజన్,తదితరులు పాల్గొన్నారు.




చాకలి ఐలమ్మకు నివాళులర్పిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

## చాకలి ఐలమ్మ ధైర్య సాహసాలు స్ఫూర్తిదాయకం: పుస్తకాల నర్సింగ్ రావు

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 10(ప్రభాత ఉదయం) తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ ధైర్య సాహసాలు నేటి యువతరానికి స్ఫూర్తిదాయకమని ఏఐటియుసి నాయకుడు పుస్తకాల నర్సింగ్ రావు కొనియాడారు. మంగళవారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో బుద్వేల్ చౌరస్తాలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ...భూస్వాముల నుండి తన పంటలను కాపాడటం కోసం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన దొరలను, భూస్వాములను రజాకారులను,ఎదురించిన వీర వనిత. వేలాది మందికి ధైర్యాన్ని ఇచ్చిన యోధురాలు కామ్రేడ్ చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి సందర్భంగా బుద్వేల్ చౌరస్తాలో తన చిత్రపటానికి పూలమాల వేసి జోహార్లు అర్పించారు. ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి, సిపిఐ పార్టీ ఆఫీస్ సెక్రటరీ జి.సత్యనారాయణ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# షీ టీం సేవల గురించి విద్యార్థినిలకు అవగాహన కార్యక్రమం





గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10(ప్రభాత ఉదయం)జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస రావు ఆదేశాల మేరకు మంగళవారం పోలీస్ షి టీమ్ బృందం ఆధ్వర్యంలో గద్వాల్ పట్టణం లోని విశ్వేశ్వరయ్య మెమోరియల్ స్కూల్ విద్యార్థులకు షీ టీం సేవల గురించి, మహిళలు వేదింపులకు గురైనప్పుడు షి టీం ను సంప్రదించాల్సిన ఆవశ్యకత, విద్య ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీ టీమ్ సభ్యులు మాట్లాడుతూ.. మహిళలు రక్షణకు షీ టీం ప్రత్యేకంగా పనిచేస్తుందన్నారు. విద్యార్థినులను వేధింపులకు గురిచేసిన, ర్యాగింగ్ చేసిన కఠిన చర్యలు ఉంటాయని స్కూల్లో, కళాశాలలో, బస్ స్టాప్ ఇతర నిర్మాణ ప్రాంతాలు ఎవరైనా అమ్మాయిలను వేధిస్తే షీ టీం పోలీస్ హెల్ప్ లైన్ నెంబర్ 8712670312 కు లేదా డయాల్ 100 కు కాల్ చేయాలన్నారు. సమచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడుతాయాని తెలిపారు.అలాగే వేధింపుల రకాలు, షి టీం ను అప్రోచ్ అయ్యే విధానం ను, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి తెలియజేశారు. విద్యా ఆవశ్యకత గురించి తెలియజేసి బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాల గురించి, పోక్సో కేసుల నమోదు, శిక్షల గురించి వివరించారు. మహిళలు, బాలికలు సురక్షితంగా ఉండుటకు తీసుకోవాల్సిన జాగ్రత్తల ను వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, షి టీమ్ సభ్యులు దివ్యవాణి, హన్మంతు, లోకేశ్వరీ మరియు విద్యార్థినిలు పాల్గొన్నారు.




## చాకలి ఐలమ్మ స్పూర్తితో భూ పోరాటాలు

గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10(ప్రభాత ఉదయం) సిపిఎం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు చిట్యాల ఐలమ్మ స్పూర్తితో తెలంగాణ రాష్ట్రంలో భూమిలేని పేదలందరికీ భూ పంపిణీ కోసం పోరాటాలు చేయవలసిన అవసరం ఉందని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వివి నరసింహా అన్నారు గురువారం స్థానిక సిపిఎం జిల్లా కార్యాలయంలో 39 వ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు చిట్యాల ఐలమ్మ నాటి భూస్వామ్య వ్యవస్థ కు వ్యతిరేకంగా పీడిత జాతులందరినీ ఏకం చేసి ఉత్పత్తి చేసిన వ్యక్తి కే ఉత్పత్తిపై అధికారం ఉండాలని చైతన్యం తెచ్చిందన్నారు భూస్వాములు జమిందార్ లు రైతులపై చేస్తున్న ఆగడాలకు వ్యతిరేకంగా వారందరినీ సంఘటితం చేసి దున్నేవాడిదే భూమి ఉత్పత్తి చేసిన వారికే సంపదపై హక్కు అని నిన దించి పీడిత జాతులకు అండగా సాయుధ పోరాటలు చేసిందన్నారు ఐలమ్మ స్పూర్తితో తెలంగాణ రాష్ట్రంలో భూమిలేని నిరుపేదలకు భూమిని పంపిణీ చేయాలని ప్రజలు ఉద్యమ బాట పట్టాలని పిలుపునిచ్చారు అట్టడుగు కులాలు ఉత్పత్తిని చేస్తున్నప్పటికి సంపదపై పెతనం మాత్రం పెట్టుబడిదారులు చేస్తున్నారని ధ్వజమెత్తారు. భూమి ఆర్థిక సాధికారతకు మూలమని అటువంటి సహజ వనరులను బడా కార్పొరేట్ శక్తులకు పెట్టుబడిదారులకు ధారధతం చేస్తూ అట్టడుగు జాతులకు మాత్రం భూమిని దూరం చేస్తూ వారిని బానిసలుగా చూస్తున్నారని విమర్శించారు ఎలా మనస్పూర్తితో తెలంగాణ రాష్ట్రంలో సిపిఎం ఆధ్వర్యంలో చేసే భూ పోరాటాలకు ప్రజలు కలిసి రావాలని కోరారు ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఉప్పేర్ నరసింహా నర్మద కార్మికులు రంగన్న రామకృష్ణ కళ్యాణ విష్ణు రాజేషు నరసింహా తదితరులు పాల్గొన్నారు .




## ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేధిక

గద్వాల(కేటిదొడ్డి),సెప్టెంబర్10(ప్రభాత ఉదయం)కేటిదొడ్డి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై మూడో విడత సామాజిక తనిఖీ ప్రజా వేదికను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఆర్డీవో, జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు అధికారిగా వ్యవహరించారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు మండలంలోని 23 గ్రామాల్లో చేపట్టిన వివిధ పనులపై నివేదికలను చదివి వినిపించారు. మండలంలో మొత్తం రూ.4.18 కోట్లు ఖర్చు జరిగినట్లు అధికారులు తెలిపారు. సర్వే చేసిన నివేదికను సోషల్ ఆడిట్ బృందం వారు పంచాయతీ గ్రామాల వారీగా ప్రజావేదికలో చదివి వినిపించారు. ఈ పనులపై తనిఖీ నిర్వహించగా ఉపాధి హామీ సిబ్బంది కొలతల్లో తేడాలు, మస్టర్లలో కూలీల సంతకాలు, ఒకరి బదులు మరొక్కరు కూలీలు హాజరు కావడంతో వేతనాల చెల్లింపులు, మస్టర్ల హాజరు గణన లెక్కింపులో తప్పిదాలు, పని ప్రదేశం తేడాలు వంటి తప్పిదాలపై మండలంలోని 23 గ్రామాలకు గాను రూ.1,91,000 రికవరీకి ఆదేశించినట్లు అధికారులు తెలిపారు. మండలంలో జరిగిన ఉపాధిపనుల అవకవతవకలపై టీఏలకు, ఫీల్ట్ అసిస్టెంట్ లకు, పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు అందజేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణమోహన్, ఎస్ టిఎం అజయ్ కుమార్, ఏపీవో అనిల్ కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, సామాజిక తనిఖీ బృందం సభ్యులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.






## స్టేట్ లెవెల్ స్కేటింగ్ పోటీలకు మీర్జాపురం స్టూడెంట్ ఎంపిక

### జిల్లా స్థాయిలో మూడు మెడల్స్ సాధించిన రితిక్ అభిమన్య రెడ్డి

గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10(ప్రభాత ఉదయం)స్టేట్ లెవెల్ స్కేటింగ్ పోటీలకు ధరూర్ మండలంలోని మిర్జాపురం గ్రామానికి చెందిన రితిక్ అభిమన్య రెడ్డి ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. వచ్చే నెలలో స్టేట్ లెవెల్ స్కేటింగ్ పోటీలు హైదరాబాదులో నిర్వహించడం జరుగుతుందన్నారు. గత నెల 8, 9 తేదీలలో రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో స్కేటింగ్ పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. అందులో మహబూబ్ నగర్ జిల్లా తరపున పాల్గొన్న రితిక్ అభిమన్య రెడ్డి అండర్-10 లోని మూడు విభాగాలలో ఒక గోల్డ్ రెండు సిల్వర్ మెడల్స్ సాధించి స్టేట్ లెవల్ కు అర్హత సాధించారని రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు తెలిపారు. వచ్చే నెలలో జరిగే స్టేట్ లెవెల్ కాంపిటీషన్ లో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా తరపున స్కేటింగ్ పోటీలో పాల్గొంటున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వాసులు అభిమన్యరెడ్డిని అభినందించారు.



## కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుంది

### టీపీసీసీ అధ్యక్షులుగా నియమితులైన మహేష్ కుమార్ గౌడ్‌కి శుభాకాంక్షలు తెలిపిన గొల్ల జాన్

కూకట్‌పల్లి, సెప్టెంబర్ 10 (ప్రభాత ఉదయం) టీపీసీసీ నూతన అధ్యక్షుడిగా బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ నియామకమయిన శుభ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఎన్ ఎస్ యు ఐ ప్రధాన కార్యదర్శి గొల్ల జాన్ మంగళవారం ఎమ్మెల్యే క్వార్టర్స్ లోని అయిన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్చం అందజేసి, సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గొల్ల జాన్ మాట్లాడుతూ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ నిజామాబాద్ గిరిరాజ్ కళాశాలలో డిగ్రీ చదువుతున్న సమయంలో విద్యార్థి దశలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, 1986లో నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడిగా, జాతీయ యువజన కాంగ్రెస్ కార్యదర్శిగా పని చేశాడు. ఆయన ఆ తరువాత 1994లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో డిచ్‌పల్లి నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా చిన్న వయస్సులోనే పోటీ చేసి ఓటమిపాలయ్యాడు. మహేష్ కుమార్ 2013 నుండి 2014 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా పని చేశాడు. ఎన్ ఎస్ యు ఐ విద్యార్థి నాయకుడి నుండి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఇన్ ఛార్జ్ ఆర్గనైజేషన్ గా పార్టీ కోసం నిరంతరం పని చేస్తు ఎమ్మెల్సీ గా ఎన్నికై ఇప్పుడు పార్టీ రథసారథి కావడం సంతోషంగా ఉందని అన్నారు. మహేష్ కుమార్ గౌడ్ పీసీసీ అధ్యక్షుడిగా రాష్ట్రంలో పార్టీ నీ మరింత బలోపేతం చేస్తారని ఆశిస్తున్నానని అన్నారు. మీ నేతృత్వంలో తెలంగాణ లో కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలు, కార్యకర్తల ద్వారా ప్రజల్లోకి తీసుకుపోవడమే కాకుండా పార్టీ పటిష్ఠతకు కృషి చేస్తారని ఆశిస్తూ, కాంగ్రెస్ పార్టీలో కష్టపడితే సాధారణ కార్యకర్తను సైతం రాష్ట్ర అధ్యక్షులుగా ఎదిగే అవకాశం ఉంటుందని మరోసారి నిరూపించబడిందని అన్నారు. టీపిసిసి అధ్యక్షులుగా మీ సారధ్యంలో తెలంగాణాలో రానున్న స్థానిక సంస్థల, జిహెచ్ఎంసీ, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయ దుందుభి సాధిస్తుందని ఆకాంక్షించారు.



వరద ముంపు నష్టాన్ని మంత్రి ఉత్తంకుమార్ రెడ్డికి వివరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి, చిత్రంలో మంత్రి కృష్ణారావు

## చిన్నోనిపల్లి, నాగర్ దొడ్డి ముంపు గ్రామాల ప్రజలకు అత్యవసర ఆర్థిక సహాయం అందించాలి

### ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10(ప్రభాత ఉదయం)ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గద్వాల నియోజకవర్గంలోని చిన్నోనిపల్లి, నాగర్ దొడ్డి గ్రామాల ముంపు ప్రాంతాలు పూర్తిగా వరదనీటిలో మునిగిపోయి, వరదనీరు ఇళ్లల్లోకి చేరుకున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీరికి కేటాయించిన పునరావాస కేంద్రాలలో మౌలిక వసతుల కల్పనతో పాటు వీరికి అత్యవసర సహాయం క్రింద తక్షణ ఆర్థిక సాయం అందజేయాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ని కోరారు. మంగళవారం హైదరాబాద్ లో మంత్రి జూపల్లి కృష్ణారావు తో కలిసి ముంపు గ్రామాల సమస్యలపై మంత్రికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి విన్నవించారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని భారీ వర్షాలతో చిన్నోనిపల్లి, నాగర్ దొడ్డి ప్రాంతాలు పూర్తిగా వరదనీటితో నిండి పోయిందని, అక్కడ నివసిస్తున్న ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరు ఆర్ఆర్ సెంటర్ల కు వెళ్లి నివసించడానికి అక్కడ మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. అలాగే ముంపు ప్రాంతాల నుంచి ఆర్ ఆర్ సెంటర్ కు వెళుతున్న ప్రజలకు అత్యవసర ఆర్థిక సహాయం చేయాలని కోరారు దీనికి ఇరిగేషన్ మంత్రి సానుకూలంగా స్పందించి జిల్లా కలెక్టర్ కు ఆదేశాలు జారీ చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు.



## భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ

### రజాకార్లను తరిమికొట్టి తెలంగాణ సాయుధ పోరాటానికి బీజం వేసిన వీర వనిత చాకలి ఐలమ్మ

### కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి, సెప్టెంబర్ 10 (ప్రభాత ఉదయం) తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి సందర్భంగా మూసాపేట్ ధోబీ ఘాట్ లో గల ఐలమ్మ విగ్రహానికి కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మూసాపేట్ మాజీ కార్పోరేటర్లు తూము శ్రావణ్ కుమార్, పగడాల బాబు రావు తో కలిసి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడి తెలంగాణ ప్రజల తెగువను, పోరాట స్పూర్తిని ప్రపంచానికి చాటిన నిప్పుకణిక చాకలి ఐలమ్మ అని అన్నారు. రజాకార్లను తరిమికొట్టి తెలంగాణ సాయుధ పోరాటానికి బీజం వేసిందని, ఆమె పోరాట స్పూర్తిని నేటి మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, జిల్లా గోపాల్, నోముల సుందర్, శంకర్, యాదగిరి , స్వామి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు

### ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్

కూకట్‌పల్లి, సెప్టెంబర్ 10 (ప్రభాత ఉదయం) ఫతే నగర్, బాలానగర్ డివిజన్ ఈదమ్మ రజక సంఘం ఆధ్వర్యంలో వీరనారి చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ అయిలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బిక్షపతి, రజక సంఘం అధక్షులు సి బాలకృష్ణ, జనరల్ సెక్రటరీ అశోక్, ఎట్టయ్య, శంకర్, భాగయ్య, శ్రీనివాస్, నర్సింగ్ రావు, శ్రీనివాస్, యోగి, సత్తి, శేఖర్, సురేష్, విశ్వనాథ్, శేఖర్, సలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు సన్మానం

రాజేంద్రనగర్, సెప్టెంబర్10(ప్రభాత ఉదయం) : తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షునిగా నియమితులైన బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను మంగళవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ కలిసి సన్మానం చేశారు. మొక్కను బహుకరించారు.



టీపీసీసీ అధ్యక్షుడుగా నియమితులైన బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను కలసి సన్మానిస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్

## పిఎసి చైర్మన్‌గా నియమితులైన అరికెపూడి గాంధీకి శుభాకాంక్షలు తెలిపిన జిల్లా గణేష్

కూకట్‌పల్లి, సెప్టెంబర్ 10 (ప్రభాత ఉదయం) శేరిలింగంపల్లి నియోజకవర్గ స్థానిక శాసనసభ సభ్యులు అరికెపూడి గాంధీ కి ప్రజా పద్దుల కమిటీ చైర్మన్ గా రాష్ట్ర ప్రభుత్వం నియమించిన శుభసందర్భంగా ఆల్విన్ కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జిల్లా గణేష్, పలువురు కాలనీ సభ్యులతో కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కాలనీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.